"నేను మీకన్న చాలా చక్కనిదాన్ని కనుక—" అంది వంటలక్క.

"మా ఆయన చెప్పారా ఏమిటి?" అంది డిప్యూటీ కలెక్టరుగారి భార్య.

"మిమ్మల్నీ, నన్నూ చూసిన ప్రతివాళ్లూ అనుకుంటున్నారు" అని చెప్పింది వంటలక్క.

"ఉహూఁ" అన్నది కలెక్టరుగారి ఇల్లాలు.

"ఇంకో కారణం ఏమిటంటే, నేను మీకన్న మర్యాద బాగా చేస్తానట" అంది వంటావిడ.

"ఈ మాట మా ఆయనే చెప్పారా?" అని అడిగింది యింటావిడ.

"అబ్బే! మీ యింటికి వచ్చిన ప్రతివారూ చెప్పారు" అని చెప్పింది వంటమనిషి.

"ఉహూఁ" అంది కలెక్టరుగారి గృహిణి.

"ముఖ్యమైన మూడో కారణం ఏమిటో చెప్పనా? నేను మీ కంటె బాగా ప్రేమిస్తానుట. మీకన్న ఎక్కువగా సుఖ పెడతానుట" అని గట్టిగా అంది వంటలక్క.

"ఈ మాట తప్పకుండా మా ఆయన చెప్పివుంటారు" అని ఏదో జయం పొందినట్టుగా వంటలక్కకేసి చూసింది కలెక్టరు భార్య.

"ఆయనకాదు పాపం! మీ మోటారు డ్రైవరు చెప్పాడు నాకు" అంటూ వీధిలోకి నడిచింది వంటావిడ.

కలెక్టరుగారి యిల్లాలు దిమ్మెరపోయింది.

———

# 9. పెంపుడు కొడుకు

పది సంవత్సరాలకు పూర్వం భార్య చనిపోయినప్పటినుంచీ చిదంబర శాస్త్రి తన కొడుకు శంకరయ్యని యెంతో జాగ్రత్తగా, అల్లారు

ముద్దుగా పెంచుతూ వచ్చాడు. శారదాబిల్లు హడావిడిలో యెనిమిదేండ్ల కూన నొక దానిని చూసి, కొడుక్కి ముడిపెట్టి, తరతరాలనుంచీ సనా తన సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వచ్చిన వంశప్రతిష్ఠని నిలబెట్టు కున్నానని సంతోషించాడు. ప్రపంచంలో తండ్రు లందరిలాగే తన కొడుకు తనకన్న గొప్పవాడు కావాలని తన చదువంతా కొడుక్కి ధార పోశాడు. కోడలు రాజమ్మ సమర్తాడిన కబురుతెలిసి తన కొడుకు వొక యింటివాడయినాడు గదా అని పొంగిపోయినాడు. గర్భాదానానికి మంచి ముహూర్తంకోసం యెదురు చూస్తుండగానే కలరా వచ్చి పందొమ్మి దేండ్ల శంకరయ్యా మట్టిపాలయిపోయాడు.

దానితో చిదంబరశాస్త్రి నిలువునా కూలిపోయాడు. నాలుగు నెలల దాకా ప్రపంచపు మొహం చూడటానికి అతనికి మనస్కరించలేదు. తరువాత ప్రజలలో పడినా, కళా కాంతీ అతనికి రాలేదు. నలుగురితో కలిసి సంతోషంగా మాట్లాడటానికి అతనికి మనస్కరించలేదు. ఉబ్బెత్తుగావున్న ఎదురురొమ్మూ, మెలికలు దిరిగిన దండలూ, నిగనిగలాడే శరీరచ్ఛాయా, అన్నీ మారిపోయి శాస్త్రి శరీరము చాలా కృశించింది. రోజులు మాత్రం గడిచిపోతున్నాయి.

చిదంబరశాస్త్రిని యిప్పుడు వేధిస్తూ వున్న సమస్య యేమిటీ?

తన ముప్ఫయ్యోయేటనే భార్య చనిపోగానే, రాజమ్మని తనకే యిస్తామని వచ్చారు. కాని, కుర్రవాడు పాడైపోతాడని, ఆ వొక్క నలుసునూ జాగ్రత్తగా పెంచుకుంటే, తన వంశానికి అంతే చాలునని చెప్పి తను పెళ్ళిచేసుకోవడం మానివేసి, ఆ రాజమ్మనే తన కొడుక్కి యిచ్చి పెళ్ళిచేశాడు. కుర్రాణ్ణి వొయింటివాణ్ణి చేసేటప్పటికి వాడు కాస్తా 'హరీ' అన్నాడు. కోడలా పదిహేనేళ్ళ పిల్ల. ఆస్తి చూద్దామా, దమ్మిడీ సంపాదించలేని పదితరాలవాళ్ళు తినతగింది. ఈ ఆస్తి అంతా యేంగానూ? పైనపడుతూన్న వృద్ధాప్యములో తనను సంరక్షించేవాళ్ళు ఎవరూ? ఈ ఆలోచన మధ్యపడి శాస్త్రిమనసు నలిగిపోతోంది. అన్నం వండుకొని తినడం ప్రాణాంతకంగా వున్నది. జీవితానికి అవధి యెప్పుడా, ఎలాగా అని ఆలోచనలోపడి మనిషి సగమైపోయాడు. విరక్తిగలిగి కొడుకు చదువుకున్న పుస్తకాలన్నీ వాళ్ళకీ వీళ్ళకీ పంచి

పెట్టేశాడు. చచ్చిపోతే తనను దహనంచేసేవాళ్ళుకూడా యెవరూ కన పడలేదు. కొడుకు పోయినప్పటినుంచీ చిదంబరశాస్త్రికి యిదే విచారము.

శాస్త్రి సాధారణంగా యిల్లు వదలి వెళ్లేవాడు కాదు. ఎప్పుడైనా వెడితే కామప్ప సోమయాజులుగారి యింటికి వెళ్ళేవాడు.

ఓ రోజున కామప్ప సోమయాజులు అన్నాడు- "చూడు, చిదంబరం! ఆ కోడలు కుర్రదాన్ని తీసుకొచ్చి, దానిపేరట యే కుర్రాణ్ణి అయినా దత్తత చేసుకో" అని.

"ఆఁ...." అని మళ్ళీ చెప్పమన్నట్టుగా దీర్ఘం తీశాడు శాస్త్రి.

"నీకు దక్షత యెవరూ లేరు. పరువూ, ప్రతిష్ఠా కలిగి బ్రతికినందుకు నీ వంశం నిలబెట్టుకునే వుపాయం చూడాలి. నీ కోడలైనా బుద్ధిమంతురాలూ, జాగ్రతకల మనిషీ అనే వింటున్నాము కాని మరోలాగ కాదుగదా కనక, ఆ పిల్లదాన్ని తీసుకొచ్చి, నువ్వు దానిపేర యెవణ్ణయినా దత్తత చేసుకో: పెద్ద ముండా కొడుకుని. నేను యేది చెప్పినా, నీ మేలుకోసమే చెపుతానుగాని—"

"ఏమిటిలే మామయ్యా, చెట్టులాంటి కొడుకు మట్టిపాలయిపోయాడు. ఇంక యితర్లపిల్లాడు నన్ను నిర్వాహకంచేసి కడతేరుస్తాడా? అయిపోయింది; నా జన్మ యెందుకూ పనికి రాలేదు" అని కళ్లనీరు నించాడు చిదంబరశాస్త్రి.

"నువ్వు బాధపడనక్కరలేదు. నీతోటీ, కోడలితోటీ అతుక్కుపోయే కుర్రాడు వొకడు నా దృష్టిలో వున్నాడు. నా రెండోకూతురి మూడో కొడుకు మధుసూదనం—"

"వాడు తెలివిగల కుర్రాడే!"

"అఖండమైన తెలివి తేటలు గలవాడు; అతుక్కుపోయేవాడు కూడాను ఎటొచ్చీ మా అమ్మాయి వొప్పుకోవాలి. అది నా చేతుల్లో పని. నీవు యిష్టపడితే ఎలాగో అలా దానిచేత వొప్పిస్తాను. ఆయితే, నువ్వే దత్తత చేసుకుంటే కోడలికి వేరే భరణము యివ్వడమూ, దానికోసము పోట్లాటలూ రావచ్చును కనక, కోడల్ని మెల్లిగా తీసుకొచ్చి యిక్కడనే వుణ్ణిచ్చుకొని, దానిపేర దత్తతచేసుకుంటే, నీవంశమూ నిలుస్తుంది; ఆస్తికి పోట్లాటలూ వుండవు. నీ ఆస్తి ఎలాగా నీ అనంతరము నీ

కోడలిదే. దాని అన్నదమ్ములాళ్లు దాన్ని మంచిచేసుకొని, ఆ ఆస్తి కాస్తా కాజేస్తారు. ఇటు వంశమూ పేరులేకుండా పోతుంది. అందుచేత ఎలాగయినా దత్తు చేసుకోవడము ఉత్తమమయిన కార్యము...."

చిదంబరశాస్త్రి యింతదూరము యెప్పుడూ ఆలోచించలేదు. నిజంగా కామప్ప సోమయాజులి మనమణ్ణే దత్తు యిచ్చినట్లయితే, అది కోరతగినదే. అన్నిటికన్నా తనకు యిష్టములేని విషయము, తన ఆస్తి కోడలి పుట్టింటివారికి చెందడము.

"అయితే కోడల్ని యిక్కడ వుంచడానికి వాళ్ళు వొప్పు కుంటారుటయ్యా?"

"వొప్పుకోక యేంచేస్తారయ్యా, వాళ్లకే తినటానికి లేక మాడు తూంటేనూ! ఎలా వొదుల్తుందిరా అని వాళ్లేడుస్తూ వుంటారు."

"..............................."

"ఇంకా జుట్టు తీయించలేదుటలే. అయినా ఫరవాలేదు. చిన్న కుంక అని వుంచేశారేమో. ఏ రామేశ్వరయాత్రో చేయించి, దత్తత నాటికి మనమే తీయించివేతాం."

"సరేగాని మామ్మా, ఈ విషయం పైసలు చెయ్యవలసిన బాధ్యత నీదీ! ఎలాగో నువ్వే సరిపడచెయ్యాలి" అని చిదంబరశాస్త్రి కామప్ప సోమయాజులి సహాయాన్ని కోరాడు.

* * *

కామప్ప సోమయాజులు వేసిన బీజం శాస్త్రి మనసులో బాగా నాటుకుంది. తనకు వండిపెట్టేవాళ్లు ఎవరూ లేకపోవడమూ, తన ఆస్తిని యెవరికో చెందజేసి తన వంశము నిలబెట్టుకోవాలనే కోరికా శాస్త్రిని యీ ఆలోచనకి పూర్తిగా వశపరిచాయి. సోమయాజులు చెప్పిన ఆలోచన కూడా సమంజసముగానే తోచింది శాస్త్రికి. ఆప్తులనుకున్న నలుగు రైదుగుర్ని సంప్రదించి చూశాడు. వాళ్ళుకూడా బాగానే వుందన్నారు. అలా అయితే అది తప్పక చెయ్యవలసిన పనే అనుకున్నాడు చిదంబర శాస్త్రి. వియ్యాలవారి యింటికి సోమయాజులినే పంపించాడు. సోమ యాజులు గొప్ప వ్యవహర్తకాకపోయినా లౌకికుడే. వాళ్లకు చెప్ప వలసిన రీతిగా వాళ్ళకు చెప్పి, వాళ్ళచేత కూడా వొప్పించాడు. తన మన

మణ్ణి దత్తుచేసుకోవడానికి చిదంబరశాస్త్రి వొప్పుకున్నాడని మాత్రం వాళ్ళతో చెప్పలేదు. శాస్త్రి ఆ స్త్రీని యెలా కాచేద్దామా అని ఆలోచనలో పడి కొట్టుకుంటూన్న వాళ్ళకి యిది మంచి అవకాశంగా తోచింది. రాజమ్మని పిలిచి అడిగాడు. రాజమ్మ తెలివిగలది. బడిచదువు అయిదో క్లాసు దాకానే అయినా, పెద్దన్నయ్య అప్పుడప్పుడు తెచ్చే నవలలూ, పత్రికలూ చదివేది. కొంచెము పరిస్థితులు ఆకళింపు చేసుకోగల వ్యక్తి. ఆలోచించుకొని మామగారి యింటికి వెళ్ళడానికి వొప్పుకుంది.

క్రొత్తగా వెళ్ళి ఒక్కతే వుండలేదని రాజమ్మతోటి తల్లి కూడా వెళ్ళి నాలుగు నెల పాటు అక్కడ మకాంవేసి, సంసారం యెలా దిద్దుకోవాలో, ఇరుగు పొరుగువారితో యెలా మెలగాలో బోధించి వెళ్ళిపోయింది.

మామగారు చూపే ఆదరణ రాజమ్మకి చల్లగా వుంది. ఆ యిల్లూ వాకిలీ తనదనే భావం కలిగింది. ఆ భావంతోటి యింటి విషయాలంటే జాగ్రతా పొందికా అమరాయి. కొన్నాళ్ళు గడిచిన తరువాత తనకు మామగారూ, మామగారికి తనూ దిక్కయ్యా మనుకుంది. మామగారి సుఖం చూడవలసిన బాధ్యత తన దనుకుంది.

ఆరేడు నెలలు జరిగాయి. చిదంబరశాస్త్రికి చలిజ్వరము వచ్చి చచ్చేటంత చేసింది. శాస్త్రి ప్రక్కన కూర్చుండి రాజమ్మ కన్నీరు ధారగా యేడ్చింది. తన మీద ఆమెకు ఉన్న అనురాగానికి శాస్త్రి పొంగిపోయాడు. "ఏడవకు రాజ్యం!" అని వీపు నిమిరాడు. ఆమె వొళ్ళు జలదరించింది. అతడు మహదానందం పొందాడు. రాజమ్మ సిగ్గేసి తలవొంచుకుంది. కాసేపు అక్కడే కూచుని మెల్లిగా వెళ్ళిపోయింది.

చిదంబరశాస్త్రికి ఆరోగ్యము కలిగింది. రాజమ్మ చేసిన పరిచర్య నిరుపమానమైనది. ముప్ఫయ్యవయేట యెలా వున్నాడో అలాగ తయారయాడు. కండలు మెలిదిరిగాయి. ఎదురు రొమ్ము నునుపెక్కింది. ఒళ్ళంతా కాంతివంత మయింది.

శాస్త్రిని చూసి రాజమ్మ 'పెద్దయితే యిలాగ ఉండేవారు' అని తన భర్తను తలుచుకొనేది. ఆమెకు సాటికుటుంబాలన్నిటిలోనూ ఉన్న జీవకళ తన యింట్లో లేదనే భావం తోచింది. అన్ని సౌఖ్యాలూ అందరి

యిళ్ళలోలాగా సామాన్యముగా ఉన్నా, ఏదో లేదనుకుంటుంది. అదే మిటో ఆమెకి తెలియదు. కాని యేదో లోపము- భావాతీతమైనది, తన జీవిత సుఖసర్వస్వానికి చెందినది- యేదో ఆమె అనుభవిస్తూంది.

ఆ రోజున ఆమె తలంటి పోసుకున్నది. విడి విడిగా గాలికి యెగురుతూ పట్టుకుచ్చులాగ ఆమె తల వెంట్రుకలు ఆమె బంగారము లాంటి మొహానికి శోభ నిచ్చాయి. ఆమెకు ఆ రోజు అర్థముకాని సంతోషమూ, ఉత్సాహమూ వచ్చాయి.ఆమెకే తెలియలేదు వాటి కారణం.

పెరట్లో మంచాలు వేసికొని పడుకున్నారు. మామూలు ప్రకారము యిద్దరి మంచాలు నాలుగు గజాలదూరములో వేసింది రాజమ్మ. తను అన్నము తిని, ఇల్లు సర్దుకొని మంచం దగ్గరకు వచ్చింది. చిదంబరశాస్త్రి నిద్రపోతున్నాడు. ఆకాశమూ, భూమికూడా 'చల్లని తెలుపు'తో కప్పివేసిన చంద్రుడు చిదంబరశాస్త్రి శరీరచ్ఛాయను మనోహరంగా చేశాడు. రాజమ్మకి ఏమీ తోచిందో- శాస్త్రివైపు అలాగే నాలుగైదు నిమిషాలు చూసింది—ఒక్క నిట్టూర్పు—ఆమె తన పక్కమీద పడుకుంది.

మళ్ళీ మెళుకువ వచ్చింది ఆమెకు కళ్ళు తెరిచి చూసింది ఆమె. వెన్నెలలో రెండో చందమామలాగ కాంతిమంతంగా ఉన్న తన మొహం కేసి చిదంబరశాస్త్రి శాంతంగా చూస్తున్నాడు. నిద్రలో చెదిరిపోయిన పైట సవరించుకుంది ఆమె. ఒకరికళ్ళల్లోకి వొకరు చూసుకున్నారు. ప్రకృతి గంభీరమైన ప్రశాంతిని నెలకొల్పింది. చిదంబరశాస్త్రి ఆమె ప్రక్కన కూచున్నాడు. ఆమె యేదో చెప్పబోయింది... ఆమె చెప్పదలచిన మాట గొంతులోనే వుండిపోయింది.

*　　　　*　　　　*

తెల్లవారింది. రోజులు తిన్నగా గడిచిపోతున్నాయి. ఘోరమయిన పాపం చేశానని మనస్సులో కుంగిపోతూ ఉండేవాడు చిదంబరశాస్త్రి మాత్రం.

దత్తు సంగతి కామప్ప సోమయాజులు హెచ్చరించినా, చిదంబరశాస్త్రి "కోడలికి సంసారము మీద కొంచెము శ్రద్ధ కలగనీ మామా, అలాగే చేసుకుంటానూ; నీకంటే నాకు ఆప్తులు లేరుగదా. ఇహ

నువ్వు చెప్పిన మాట తీసివేస్తావా? అందులోనూ, మీదీ మాదీ స్వచ్ఛమైన వంశాలు. కొంచెం నిభాయించుకొని అలాగే చేద్దాము" అనేవాడు. కోడల్ని కూడా రెండు మూడుసార్లు ఆమె అభిప్రాయాన్ని గురించి అడిగాడు. "ఇప్పు డేంతొందర లెండి; తరువాత చూసుకుందాము" అంది రాజమ్మ.

ఇప్పుడు రాజమ్మ యెంత చెపితే చిదంబరశాస్త్రి అంత. స్వతహాగా తెలివిగలది కావడముచేత రాజమ్మ సంసారపు దిద్దుబాట్లు బాగా తెలుసుకుంది. వయసులో వున్నా, అందముగా ఉన్నా శీలాన్ని జాగ్రతగా కాపాడుకుంటూనే ఉంది. కేవలం మానసికోద్రేకానికి శాస్త్రికి అలా లోబడిపోవడం ఆమెకీ అమితమైన విచారాన్ని కలుగజేసింది. జరిగిన సంగతికి పశ్చాత్తాపపడి ఇద్దరూ దూరదూరముగా ఉంటున్నారు.

రాజమ్మకి రెండు నెలలు వరుసగా తప్పాయి. కొంచెం కంగారు పడింది. కడుపులో త్రిప్పడమూ, డోకులూ ఆరంభించాయి. అనుమానము స్థిరపడేటప్పటికీ, అవి వేవిళ్ళని నిర్ధారణచేసుకునేటప్పటికీ మూడోనెల కూడా వెళ్ళిపోయింది. ఏమిటి చెయ్యడము? ఆమెకి ఏమీ తోచలేదు.

చిదంబరశాస్త్రికి కూడా బోధపడిపోయింది. అతని ప్రాణాలు నిలువునా పోయాయి. ఆ వూళ్ళో యింక తన పరువు దక్కదు. 'భగవంతుడా, ఏం దారి' అని ఆలోచనలో పడిపోయాడు.

రెండోకంటివాడికి తెలిసిందా, యీ భూమి మీద తలెత్తుకొని తిరగడానికి ఆస్కారము లేదు. కాకులు పొడిచినట్టు పొడుస్తారు. కర్తవ్య మేమీ బోధపడలేదు అతనికి. రాబోయే అప్రతిష్ఠను పోగొట్టుకోవడ మెలాగా? పరానికి చెడ్డాడు సరిగదా, ఇహం కూడా చెడిపోయేటట్టుగా ఉందే! పరము మాట దేము డెరుగును, బంధువు లెవరూ దగ్గరికి చేరనియ్యరు. తన బ్రాహ్మణీకమూ, ప్రతినిమిషమూ తను కాపాడుకుంటూ వచ్చిన శీలమూ మంటగలిసిపోయాయి!

ఇదివరకు యెప్పుడూ రాజమ్మకి యెదురుగా కూర్చునేవాడు, యిప్పుడు యింట్లోనే ఉండలేకపోతున్నాడు. బయటికి పోలేకపోతున్నాడు. అమిత మనోవేదన పడుతున్నాడు. వీథిలో నడుస్తూ ఉంటే

దారినపోయే ప్రతివాడూ తనను పరిహసిస్తూ వున్నట్టూ, తనను గురించి గుసగుసలాడుతున్నట్టూ కనిపించేది.

"రాజ్యం!" అన్నాడు చిదంబరశాస్త్రి.

"ఊఁ........" అని వొంచిన తల యెత్తి అతనికేసి చూసింది రాజమ్మ.

"ఏం చేద్దా మిప్పుడు? నా కేమీ దారి తోచడము లేదు. నలుగురి లోనూ తలయెత్తుకొని తిరగలేము. ఎలాగ చెప్పు?"

"......................"

"ఈ వూళ్లో గవళ్ళ కోటమ్మ ఉంది చూడూ, దాన్ని యెరుగుదువా?"

"అమ్మయ్యో—" అంది రాజమ్మ గవళ్ళ కోటమ్మ పేరు చెవిని పడేటప్పటికి.

"భయపడకు. కొంచెం బాధగానే వుంటుంది కాని, అప్రతిష్ఠ రాకుండా చేసుకోడానికి అలా చెయ్యాలి."

"నేను వొప్పుకోను సుమండీ."

"ఏం........లేకపోతే కొంప మునిగిపోతుంది."

"ఏమయినా సరే, నే నొప్పుకోను."

నిర్ఘాంతపోయాడు చిదంబరశాస్త్రి.

"కొంపముంచావే. ఇలా చేస్తావా చివరికి?........ఏం చెయ్యమంటావు చెప్పు మరి. ఇది బయటపడితే మనము యీ వూళ్లో— యీ వూరేకాదు యీ చుట్టు ప్రక్కల ఉండలేము."

"పోనీ, పోదాం పదండి, ఎక్కడికైనా."

"ఎక్కడికిపోతాం చెప్పు. ఇల్లూ వాకిలీ వొదిలిపెట్టి, యింకో చోటికి పోయి, యేం చేస్తాం?"

"మరి యేదో దారి చూడాలి."

"ఏం దారి, గోదారి."

"మా వూళ్లో- వెనకా-"

"ఆఁ............"

"ఓ కాపు కూతురు వెధవది, యిలాగే చిక్కులో పడింది.

అతను మ్రోతుబరి. అత డేం చేశాడో తెలుసునా? ఏదో జబ్బు చేసిందని పేరు పెట్టి దాన్ని చెన్నపట్టణం తీసుకుపోయాడు."

"అబ్బా!"

"ఊఁ. అక్కడే, యే ఆసుపత్రిలోనో నీళ్ళాడింది. ఆ పిల్లని యెవరో కిరస్తానిమతంచెప్పే దొరల కిచ్చేసిందట. వాళ్ళు పెంచుకుం టున్నారు. ఎప్పుడేనా వెళ్ళి యిప్పటికీ చూసి వస్తుంది."

"అలా చేద్దామంటావా?"

"అవును. అలాగే చేయాలి."

ఆమె మాటమీద చిదంబరశాస్త్రికి ఆలోచన కలిగింది. అంతకన్న గత్యంతరము రేదు. కాని అతని మనసులో భయం మాత్రం పోలేదు.

రాజమ్మ మాట రాజశాసనంగా వొప్పుకున్నాడు శాస్త్రి. కాశీ రామేశ్వరాలకు యాత్ర పోదా మనుకుంటున్నానని నలుగురైదుగురి తోటి చెప్పాడు. వాళ్ళకి ఆయా చోట్లనుంచి కావలసిన వస్తువులు తెచ్చి పెట్టమని అతన్ని కోరారు. తప్పకుండా తెస్తానన్నాడు. కర్ర నేల కొట్టుకుంటూ, కామప్ప సోమయాజులు వచ్చి "తీర్థయాత్రకి పోతు న్నావా, శాస్తుర్లూ?" అన్నాడు.

"అవును మామా, ఒక్కసారి అలా వెళ్ళి ఆ నాలుగు క్షేత్రాలూ చూసుకొని వచ్చేస్తే నాకింక తరవాయి ఉండదు" అన్నాడు శాస్త్రి.

"అయితే దత్తుచేసుకొని పోగూడదూ, వాణ్ణి కూడా వెంటబెట్టు కొని. ఎందుకైనా అక్కరకు వస్తాడు."

"కాదులే మామా, యీ బాదరబందీలో కుదరదు. కుర్రాడు గూడా చిన్నవాడుగదా. మరీ తెలియనివాడూ కాదు, బాగా తెలిసినవాడూ కాదు. దత్తు యెలాగా ఉపనయనంలో జరగవలసిందే కనుక తొంద రేమిటిలే" అన్నాడు చిదంబరశాస్త్రి.

"అహాఁ. సరే. నాలుగు నెలలు పడుతుందా ఏమిటి?"

"ఆఁ. ఆరునెల్లు, యేడునెలల్లో తిరిగివస్తాను. ఇంక నా జీవితా నికి యిదే కొససారిగా; కోడల్ని కూడా తీసికెళ్ళి నాలుగూ చూపించేస్తా. కాస్త యిల్లూ వాకిలీ కనిపెట్టి ఉండండేం."

"దానికేమిలే. కోడలికి జుట్టు కూడా తీయించి వేస్తారా యేమిటి?"

"అనుకుంటున్నాను."

"ఊఁ" అంటూ తన పన్నుగడ ఇంకా నెరవేరకపోయినందుకు విచారిస్తూ వెళ్ళిపోయాడు కామప్ప సోమయాజులు.

చిదంబరశాస్త్రీ, రాజమ్మా రెండెడ్లబండీ కట్టించుకొని, పది మైళ్ళ దూరంలో ఉన్న రైలుస్టేషనుకి వెళ్ళి, చెన్నపట్ణం టిక్కెట్లు తీసుకున్నారు.

* * *

శాస్త్రి అదివరకోసారి చెన్నపట్నం వెళ్ళినవాడే. కనుక కొంచెం తేలికగానే ఆసుపత్రికి దారి కనుక్కొని, అక్కడికి వెళ్ళారు. వాళ్ళు పరీక్షచేసి నాలుగో నెల అనీ, తొమ్మిదో నెలలో వస్తే కాన్పు చేస్తామనీ చెప్పారు. ట్రిప్లికేనులో మారుమూల ఒక యిల్లు అద్దెకు తీసుకొని కాపురమున్నారు శాస్త్రీ, రాజమ్మాను.

చిదంబరశాస్త్రి రాజమ్మని తొమ్మిదో నెల రాగానే ఆసుపత్రిలో చేర్పించాడు. హాయిగా ప్రసవించింది. ప్రక్కనున్న బిడ్డని చూసుకొని పొంగిపోయింది. చిదంబరశాస్త్రికి కూడా బిడ్డని చూసి మనసు కరిగింది కాని ప్రపంచాన్ని తలచుకొని హడిలిపొయ్యాడు.

ఆ పిల్లాడిని చూసి చిదంబరశాస్త్రీ, రాజమ్మా ఒకర్ని వొకరు చూసుకొని తెల్లబోతూ ఉండేవారు.

అనలేక తెగించి, ధైర్యము తెచ్చుకొని, ఒకరోజున, "రాజ్యం, యీ బిడ్డని యేంచేస్తాం? దొరల——" అన్నాడు శాస్త్రి.

బిడ్డకేసి చూస్తూ వున్న రాజమ్మ "ఏమిటీ, యీ రత్నంలాంట బిడ్డనా, కిరస్తానీల కివ్వడమా?" అని కంట తడిపెట్టుకుంది.

"మరెలాగే?" అని దీనంగా అడిగాడు చిదంబరశాస్త్రి.

"ఎలాగైనా సరే, ఈ బిడ్డని వొదిలి నేను బ్రతకలేను. చూడండి లక్కపిడతలాంటి నోరూ, నీలాలలాంటి కళ్ళూ- అబ్బా-ఈ బిడ్డని చూసి చూసి మాలవాళ్ళకి యెలా యిస్తామండీ? వొద్దు."

"ఏం చేస్తాం చెప్పు? ఈ బిడ్డని తీసుకొని మన వూరు వెళ్ళ గలమా?"

"ఇక్కడే వుండిపోదాం, అలా అయితేనూ."

"ఇల్లూ, వాకిలీ, భూములూ పుత్రా చూసుకోకుండానా?"

"మీ ఆస్తీ భూములూ యీ పిల్లాడిముందర ఎందుకు పనికొస్తా యండీ, చూడండి." పిల్లాడికేసి చూసి శాస్త్రి నిలువునా కంపించి పోయాడు.

"ఏం చెయ్యను. పిల్లాడంటే నాకు మాత్రం లేకనా?"

"మరయితే, ఎలా పారేసుకుంటామండీ యీ పిల్లాణ్ణి?"

"ఏం చేస్తాం చెప్పు?"

"నేనోటి చెపుతాను, వొప్పుకుంటారా?"

"చెప్పు."

"వీడు పెద్దవాడియినదాకా యిక్కడే ఉందాము. నాలుగేళ్ళు. అప్పుడు వీణ్ణి తీసికెళ్ళి 'దత్తు చేసికొన్నాము. కాశీలో మావాళ్ళ పిల్లాడు' అలాగని చెపుదాము. ఆస్తి అంతా వీడికే చెందుతుంది. అంతేకాని యిలాంటి రత్నాన్ని యెలా పారేస్తామండి? కడుపున పుట్టిన బిడ్డని యెవళ్ళో మాలాళ్ళకి పారేసి, యింకోళ్ళ బిడ్డణ్ణి తెచ్చుకొని పెంచుదామా?"

"తెలియదుటే వూరివాళ్ళకి?"

"వాళ్ళ శ్రాద్ధం. మరో రెండు నెలలు యిక్కడ ఉండి, తర వాత క్షేత్రాలన్నీ చూడటానికి పోదాం. ఒక్కొక్క చోట నాలుగేసి నెలలుంటే సరి. ప్రతి క్షేత్రంనుంచీ మన వూరి కొక ఉత్తరం రాద్దాము- ఏ సోమయాజులి పేరనో. మీకూ నాకూ అయినవాళ్లు ఆ వూళ్లో లేనే లేరుకదా. నిజంగా మనం తీర్థయాత్రలు చేస్తున్నామని వాళ్లు అను కుంటారు. నిర్భయం మనకి."

"ఆఁ.........."శాస్త్రి ఆశ్చర్యపోయాడు రాజమ్మ తెలివికీ, ఆలోచనకీను. తప్పనిసరి కనుక వొప్పుకున్నాడు.

అనుకున్న ప్రకారం వాళ్లు క్షేత్రాలన్నీ తిరిగి, నాలుగు సంవత్స రాలకి యిల్లు చేరుకున్నారు.

కథా నిలయం
3612
శ్రీకాకుళం

"ఆ పిల్లవా డెవరోయి?" అన్నాడు కొమప్ప సోమయాజులు.

ముందుకీ వెనక్కీ కంపించిపోయాడు చిదంబరశాస్త్రి. "వీడా? మా అమ్మమ్మ తమ్ముడి కొడుకు, కాశీలో వున్నాడులే, వాడి కొడుకు. కోడలూ, నేనూ ఆరునెలలపాటు వాళ్ళింట్లోనే ఉన్నాము, కాశీలో ఉన్నప్పుడు. వీడు దానికి అలవా టయినాడు. కోడలు వీడి మీద మోజు పడింది. వాళ్లు కూడా అయినవాళ్లు. అందుచేత విశ్వేశ్వరుడిపురంలో ఆ కాస్త దత్త స్వీకారం అనిపించేను దానిచేత."

"అరి, ఎంతవాడివోయ్! అయిందీ!"

"ఏం చెయ్యను మామా? కోడలు ఒకటే పట్టు పట్టింది. నాకు తప్పింది కాదు."

"జుట్టు తీయించావు కాదేమీ?"

"తీరా తిరపతికి వెళ్ళేటప్పటికి దానికి జ్వరం తగిలింది. ఆ వూరు వొదిలిందాకా జ్వరం తీసింది కాదు. అచ్చిరాలేదని మానేశాను."

"వీడూ—అచ్చంగా కోడలులాగే వున్నాడు?"

"వాడి తల్లి సరిగ్గా కోడలులాగే ఉంటుంది. తల్లి పోలిక వీడు."

"ఊహుఁ........"

ఊళ్లోవా రంతా దత్తపుత్రుడిమీద రాజమ్మకి అమితప్రేమ అని అనుకొనేవారు.

"ఈ రత్నం నా భాగ్య"మనుకొనేది రాజమ్మ.

"నా పాప ఫలము వీడు" అనుకొనేవాడు చిదంబరశాస్త్రి.

———

# 10. సంక్రాంతి సంచిక

"ఏం కావా లమ్మా, అమ్మాయీ?" అని అడిగాడు న్యూస్ ఏజెంటు రామారావు.